సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే


ఆరీఫ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రతి కార్యకర్త ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ మైనార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు ఆరీఫ్ పార్టీ బలోపేతానికి, స్థానిక సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని అభినందిస్తూ బీఆర్ఎస్ మైనార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవలు అందించడం అభినందనీయం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి పార్టీ శ్రేణులు కృషిచేస్తున్నాయని అన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ పార్టీ నాయకులు సలీం, జహంగీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అభిషేకాలు

చిక్కడపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయంలో కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్వామివారికి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేక కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. సాయంత్రం జరిగిన ఆకాశదీపోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

6న ప్రకాశ కిరణాలు ఆవిష్కరణ

చిక్కడపల్లి : జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న త్యాగరాయగానసభలో పొత్తూరి సుబ్బారావు రచించిన ప్రకాశ కిరణాలు సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వీవీ రాఘవరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

9న సత్యానగర్ బస్తీ కమిటీ ఎన్నికలు

నల్లకుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్‌లోని సత్యానగర్ బస్తీ కమిటీ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఈనెల 9న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు సత్యానగర్ కమ్యూనిటీహాల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పి.శ్రీధర్ తెలిపారు. సత్యానగర్ బస్తీ కమిటీ ఎన్నికల్లో రెండు ప్యానల్స్‌ల బరిలో అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఎస్.ఇ.మహేందర్, నర్సింగ్‌రావులు నిలువనున్నారు. ఈరెండు ప్యానల్ అధ్యక్ష అభ్యర్థులు బస్తీలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో తమను గెలిపిస్తే బస్తీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని కరపత్రాలను అందజేసి ప్రజలను కోరుతున్నారు. ఈ బస్తీ కమిటీ ఎన్నికలు పూర్తైన తర్వాత సాయంత్రం 7గంటలకు ఎన్నికల ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు.

మున్నూరుకాపులు అభివృద్ధి సాధించాలి


నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

బర్కత్‌పుర, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు కోరారు. సోమవారం కాచిగూడలోని సంఘం కార్యాలయం లో మహాసభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగడానికి రాజకీయాలకతీతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహాసభ ఉపాధ్యక్షులుగా చంద్రకాంత్, వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా మహేష్, రమేష్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్‌గా సతీష్, ప్రధాన కార్యదర్శిగా వరుణ్, కార్యవర్గ సభ్యుడిగా భాస్కర్‌ను నియమించారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా రమేష్, సంయుక్త కన్వీనర్‌గా శ్రీకాంత్, జగిత్యాల జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్, సంయుక్త కన్వీనర్‌గా రచనలను నియమించి నియామక పత్రాలను అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. సోమవారం కాచిగూడ డివిజన్‌లోని చప్పల్‌బజార్, ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలకు సరైన ఆహారం అందించాలని, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వాటిని అందజేయాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ నిరుద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న నిరుద్యోగ జేఏసీ నేతలు

చిక్కడపల్లి : జూబ్లీహిల్స్‌లో నిరుద్యోగులపై దాడిని ఖండిస్తూ చిక్కడపల్లి సిటీ సెంట్రల్‌లైబ్రరీ ఆవరణలో నిరుద్యోగ జేఏసీ నేతలు, నిరుద్యోగవిద్యార్థులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మరోసారి నమ్మి మోసపోవద్దని ఓటర్లను చైతన్యపరుస్తున్న తరుణంలో కొందరు కాంగ్రెస్ నేతలు నిరుద్యోగులపై దాడి చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడితే సహించేదిలేదని వారు హెచ్చరించారు. ఈ ఉపఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆత్మరక్షణకు కరాటేను నేర్చుకోవాలి : కార్పొరేటర్


కరాటే విజేతలకు బెల్ట్‌లను ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, ఖలీల్ తదితరులు

రాంనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటేను నేర్చుకోవాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో ఖలీల్ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు సోమవారం వివిధ బెల్ట్‌లలో కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి కార్పొరేటర్ బెల్ట్‌లను ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి, సెంట్రల్ ఎక్సైజ్‌కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రావ్, నాయకులు సంజీవ్‌చౌదరి, సంతోష్‌రెడ్డి, వెంకటరమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం తథ్యం

నల్లకుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో బీజేపీ విజ యం తథ్యమని మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం అంబర్‌పేట నియోజకవర్గం నాయకులు సోమవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా రహమత్‌బాగ్ డివిజన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం అంబర్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు జూబ్లీహి ల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనం రమేష్ మాట్లాడుతూ కాం గ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెప్పి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, రాజశేఖర్, అనిల్‌బాబు, సాయిచరణ్, రఘుచారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

రూ.18కోట్లతో గ్రంథాలయ నూతన భవన నిర్మాణాలు, మరమ్మతులు


హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ

చిక్కడపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను అభివృద్ధి చేసే దిశలో ప్రణాళికలు సిద్ధంచేసి అమలు చేస్తున్నట్లు హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ తెలిపారు. ప్రజలు గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలని ఆమె పాఠకులకు సూచించారు. గ్రంథాలయం ఒక విజ్ఞానభాండాగారం అన్నారు. లైబ్రరీలోని పుస్తకాలు చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చునని ఆమె వివరించారు. సిటీసెంట్రల్ లైబ్రరీతో పాటు శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా పొట్లూరు పద్మజ ఇంటర్వ్యూ.

ప్రశ్న: నగరంలో ఎన్ని శాఖాగ్రంథాలయాలు ఉన్నాయి?

కార్యదర్శి: చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్‌లైబ్రరీతో కలిపి 82 శాఖాగ్రంథాలయాలున్నాయి. మొబైల్ గ్రంథాలయాలు ఇప్పుడు పనిచేయడం లేదు. అన్ని శాఖాగ్రంథాలయాల్లో కలిపి 256 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 65 మంది సిబ్బంది, 38 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. 153 మంది సిబ్బంది ఇంకా అవసరం ఉంది.

ప్రశ్న: సిటీసెంట్రల్ లైబ్రరీతో పాటు శాఖాగ్రంథాలయాల్లో తాగునీటి సౌకర్యం కోసం ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

కార్యదర్శి: పాఠకులతో పాటు ప్రతినిత్యం రెండువేల పోటీపరీక్షల అభ్యర్థులు చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో చదువుకోవడానికి వస్తుంటారు. వారికి కనీస సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ లైబ్రరీతోపాటు నగరంలోని మరో నాలుగు ప్రాంతాల్లో మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాం. పోటీపరీక్షల సమయంలో దాదాపు ఐదువేల మంది అభ్యర్థులు ప్రతినిత్యం లైబ్రరీకి చదువుకోవడానికి వస్తుంటారు. పైన ఒక హాలు, కింద గ్రౌండ్‌ఫ్లోర్‌లో పోటీపరీక్షల అభ్యర్థులు తమ తమ పుస్తకాలు తెచ్చి చదువుకోవడానికి ఏర్పాట్లు చేశాం. నగరంలోని చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీతో పాటు అన్ని శాఖా గ్రంథాలయాల్లో ప్రతినిత్యం ఏడు నుంచి ఎనిమిది వేల మంది పోటీపరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగ విద్యార్థులు చదువుకోవడానికి వస్తుంటారు. పోటీపరీక్షల సమయంలో అది పదిహేను వేలకు కూడా చేరుతుంది.

ప్రశ్న: లైబ్రరీలో ఎన్నిభాషల పుస్తకాలు లభ్యమవుతాయి. ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?

కార్యదర్శి: దాదాపు ఎనిమిది భాషల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సిటీసెంట్రల్ లైబ్రరీతో పాటు మొత్తం 82 శాఖాగ్రంథాలయాల్లో 14,17,750 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీపరీక్షల అభ్యర్థుల సౌకర్యార్థం వారు ప్రిపేర్ కావడానికి కావాల్సిన పుస్తకాలను ఆన్ డిమాండ్ పై తెప్పించి వారికోసం అందుబాటులో ఉంచాం.

ప్రశ్న: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థలో ఎంత మంది సభ్యులున్నారు?

కార్యదర్శి: హైదరాబాద్‌నగర కేంద్రగ్రంథాలయ సంస్థ పరిధిలో దాదాపు 90వేల మంది సభ్యులున్నారు. సిటీసెంట్రల్‌లైబ్రరీలో సభ్యత్వానికి 150 రూపాయలు, శాఖాగ్రంథాలయాల్లో సభ్యులుగా చేరితే 100 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. సభ్యులు పుస్తకాలను తమసభ్యత్వ కార్డు చూపించి ఇంటికి తీసుకువెళ్లొచ్చు. 14 రోజుల్లోపల తిరిగి ఇచ్చివేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: గ్రంథాయాలకు నూతన భవన నిర్మాణాలు మరమ్మతులు ఏమైనా జరుగుతున్నాయా?

కార్యదర్శి: మొత్తం 13 కొత్త గ్రంథాలయ భవనాలకుగాను రెండు భవనాల నిర్మాణం పూర్తైంది. 33 భవనాలకు మరమ్మతులు కూడా పూర్తయ్యాయి. దాదాపు రూ.18 కోట్లను పనుల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోంది.. మిగతా నిర్మాణంలో ఉన్న నూతన భవనాలు అతిత్వరలో అందుబాటులోకి వస్తాయి.

ప్రశ్న: సిటీసెంట్రల్ లైబ్రరీ భవనాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారా?

కార్యదర్శి: అవును. సిటీసెంట్రల్ లైబ్రరీ భవనాన్ని నూతనంగా రంగులతో రూపొందించాం. లైబ్రరీ భవనాన్ని వరంగల్ సెంట్రల్ లైబ్రరీ లాగా ఆర్ట్‌తో కూడిన రంగులతో రూపొందించే విధంగా సమాలోచనలు చేస్తున్నాం.

జూబ్లీహిల్స్ సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


ఓటు వేయాలని మహిళను కోరుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

నల్లకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లు వేస్తే ప్రజా సంక్షేమం, అభివృద్ధి కరువవుతుందని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరికాలనీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కృషిచేసిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అందించిన సేవలను గుర్తించి ప్రజలు ఆయన సతీమణి మాగంటి సునీతకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విస్మరించిన ప్రజా సంక్షేమాన్ని గుర్తించి ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని కోరారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో ప్రజలు ఓటు ద్వారా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు ఓట్లు వేసి పెద్ద మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దె వాహనాల డ్రైవర్ల వేతనాలు చెల్లించాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య


డ్రైవర్ల వేతనాలు చెల్లించాలని నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య శాఖలో పనిచేస్తున్న అద్దె వాహనాల డ్రైవర్ల వేతనాలను చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వాణిజ్య పన్నులశాఖ అద్దె వాహనాల డ్రైవర్ల సంఘం నాయకులు రాజు, రాంబాబుల ఆధ్వర్యంలో సోమవారం విద్యానగర్ నుంచి వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వరకు డ్రైవర్ల గర్జన నిరసన ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖల్లో గత 9 నెలలుగా అద్దె వాహనాల డ్రైవర్ల వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రతి నెలా చెల్లించాల్సిన వేతనాలు ప్రభుత్వం చెల్లించకపోవడం వల్ల అనేక మంది వాహనదారులు, డ్రైవర్లు వాహనాల ఈఎంఐలను కట్టలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వేతన బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, నవీన్, శ్రావణ్, సతీష్, ముజాహిద్, జానయ్య, అశోక్, మురళీ, నర్సింహ, కుమార్, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ సీతారాం



మాట్లాడుతున్న ఎస్పీ సీతారాం

ముషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సీతారామ్ సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో భాగంగా సోమవారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ బాలుర పాఠశాలలో ఫ్రీ డ్రగ్స్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) ఎస్పీ పి. సీతారామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండడంతో పాటు క్రమశిక్షణతో చదివి రాణించాలన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఏఎన్‌బీ డీఎస్పీ కె. సైదులు, సీఐ శ్రీనివాస్‌రావు, అంజుమన్ తాజీరానే చిరం అధ్యక్షుడు మహ్మద్ అక్తర్‌అలీ, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జయరాజ్, ఎస్ఆర్డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి తదితరులు పాల్గొన్నారు.

విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి : ప్రొఫెసర్ నాగేశ్వర్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్

రాంనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : విద్యాకాషాయీకరణకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ పోరాటం చేయాలని ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ సూ చించారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ 23వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలను పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజేష్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. పీడీఎస్‌యూ కార్యదర్శి హరీష్ అమరవీరుల సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ పాలకులు ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ విద్యను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమే పాలకుల లక్ష్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ, హన్మేష్, నాయకులు కె.ఎస్.ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సాయిబాబా

రాంనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రధాన పార్టీల డబ్బు, మద్యం పంపిణీని అరికట్టి ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా కోరారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఏ విధంగా కృషి చేస్తామనే అంశాలను ప్రజలకు చెప్పి ఓటు అడగకుండా డబ్బు, మద్యం పంపిణీ చేసి గెలవాలని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ విష సంస్కృతిని అరికట్టి ప్రజలు నిష్పక్షపాతంగా ఓట్లు వేయాలని కోరారు. ఈ మూడు పార్టీలు గెలవడానికి అడ్డదారులను ఎంచుకున్నాయని ఇది ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు అని అన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుశాఖ గట్టి నిఘా పెట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, వినోద్, శుక్లవేది తదితరులు పాల్గొన్నారు.


కార్తీకసోమవారం వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు

వైభవంగా కార్తీక సోమవారం వేడుకలు

చిక్కడపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ పీపుల్స్ పార్కులో వైభవంగా కార్తీక సోమవారం వేడుకలు స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రముఖ సభ్యుడు టి. గోపాల్ అధ్యక్షతన జరిగాయి. ఈసందర్భంగా తులసి దామోదరం పూజ, కల్యాణం జరిపించారు. కాలనీకి చెందిన దంపతులు పెద్దఎత్తున పాల్గొని ఉసిరిచెట్టువద్ద దీపాలు వెలిగించారు. తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొ. టి. గౌరీశంకర్ పాల్గొని కార్తీకమాసం విశేషాలను వివరించారు. బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ టి. శైలజాగోపాల్, చామర్తి వాణీశ్వరశాస్త్రి, గోవర్ధన్, డా. నరేష్, నాగేశ్వరరావు, వనజారాణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం, స్వీట్లు పంచిపెట్టారు.

సామాజిక భద్రత పథకాలు అందించడంలో
స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో డీసీఎల్‌లు జాసన్, రవీందర్‌రెడ్డి

చిక్కడపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వలస కార్మికులకు సామాజిక భద్రత పథకాలు అందించే విషయంలో స్వచ్ఛంద సంస్థలు కార్మిక శాఖతో సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్(డీసీఎల్)లు బి. జాసన్, రవీందర్‌రెడ్డి అన్నారు. అంకిత, జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంలో తమతో కలిసి పనిచేసి వలస కార్మికుల సంక్షేమానికి, సామాజిక భద్రతకు ముందడుగు వేయాలన్నారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని తెలంగాణ కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో అంకిత, జన్‌సాహస్ సంస్థలతో కలిసి కార్మికశాఖ ఆధ్వర్యంలో వలస కార్మికులు, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా డీసీఎల్‌లు మాట్లాడుతూ వలస కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటితరంగ కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమం కోసం దోహదపడే వివిధ ప్రభుత్వ పథకాలు కార్మికులకు చేరువ చేయడం కోసం తెలంగాణ కార్మికశాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. అంకిత సంస్థ వారు వలస కార్మికులను గుర్తించి వారికి అర్హత కలిగిన సామాజిక భద్రత పథకాలు అమలు కోసం పనిచేయడం అభినందనీయమన్నారు. వలస కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ ఉన్నవారికి అవసరమైన పథకాలు అందించేవిషయంలో కార్మికశాఖ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. వలసకార్మికుల సంక్షేమం కోసం కార్మికశాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. గిగ్ వర్కర్స్‌ను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తద్వారా వారికి కార్మికశాఖ ద్వారా సంక్షేమపథకాలు అందుతాయన్నారు. పెద్దపెద్ద భవననిర్మాణ సంస్థల నిర్మాణ కార్యక్రమాల్లో పనిచేసే వలస కార్మికులు, కూలీలకు భవననిర్మాణ, ఇతర నిర్మాణ రంగసంస్థ బోర్డులో పేర్లు నమోదు చేయించాలని అంకిత, జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్(ఏసీఎల్)లు, అంకిత, జన్‌సాహస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి పార్టీ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పి. శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో సోమవారం షేక్‌పేటకు తరలివెళ్లి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ మాగంటి సునీతను గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని శ్రీధర్‌చారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, ఎయిర్‌టెల్ రాజు, శ్రీనివాస్, కృపానంద్ పాల్గొన్నారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

మహిళల జట్టు వరల్డ్‌కప్ సాధించడంపై హర్షం

చిక్కడపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు వరల్డ్‌కప్ సాధించడం పట్ల సినిమా అభిమానుల ఐక్య వేదిక అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు హర్షం ప్రకటించారు. జట్టు సభ్యులు అసమాన ప్రతిభాపాటవాలు చాటారని మొట్టమొదటి సారిగా మహిళాజట్టు సభ్యులు వరల్డ్‌కప్ సాధించి భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్తులో క్రికెట్ క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆయన అభిలషించారు.


కార్తీకమాస సోమవారం గోల్నాక డివిజన్‌లోని వీరన్నగుట్టలో గల మహా శివాలయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మా వెంకటేష్ సందర్శించి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు బీఆర్ఎస్ నాయకులు బి.నర్సింగ్‌రావుయాదవ్, బి.అనిత యాదవ్, భక్తుడు దడిగే జగన్‌యాదవ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి


బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు మహ్మద్ హబేద్ సోమవారం ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహలను మర్యాదపూర్వకంగా కలిసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో చేస్తున్న ప్రచార కార్యక్రమాలను వివరించారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ వారు సత్కరించారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి


ముషీరాబాద్‌లో కురుస్తున్న వాన

ముషీరాబాద్‌లో ఎండ, జోరువాన

ముషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్‌లో సోమవారం జోరుగా ఎండ, ఉక్కపోతతో పాటు భారీ వర్షం పడింది. ఉన్నఫలంగా వర్షం పడడంతోపాటు ఎండ అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒకేసారి జోరుగా వర్షం పడడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా యూసుఫ్‌గూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు - రాంనగర్, ఆంధ్రజ్యోతి


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా ఎల్లారెడ్డిగూడ డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సంజయ్ ఘనాటే, నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ఈశ్వరప్ప, మెట్టు వాసు తదితరులు - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి